6న పాలకొండలో జాబ్ మేళా

పార్వతీపురం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా ఈనెల 6న పాలకొండలోని తమ్మునాయుడు కాలేజీలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని 18 నుంచి 28 ఏళ్ల లోపు గల నిరుద్యోగ యువత జాబ్ మేళాకు హాజరు కావచ్చన్నారు. ఈ జాబ్ మేళాకు 11 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను కంపెనీలోకి ఎంపిక చేసుకోవచ్చన్నారు.కావున ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత తమ వివరాలను https:// naipunyam.ap. gov.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటు బయో డేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో డ్రైవ్ జరుగు ప్రదేశానికి హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 63012 75511, 79937 95796 నందు సంప్రదించాలని తెలిపారు.

రైతన్నకు అండగా ప్రభుత్వం

సాలూరులో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

అన్నదాతకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం సాలూరు మెంటాడ వీధిలో గల కోదండరామా కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని నేటి నుంచి అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 1,22,260 మంది రైతులు ఇ-పంట తదితర అన్ని అంశాలను పూర్తి చేసుకుని అర్హులుగా గుర్తించామని అన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు చొప్పున రూ.84.58 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు ఆమె అన్నారు. జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు నవధాన్యాల విత్తనాలను ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని, రైతులు వాటిని వినియోగించడం వల్ల అధిక దిగుబడి వస్తుందని కలెక్టర్ తెలిపారు. డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం పనిచేస్తామ న్నారు. వారికి కావాల్సిన రుణాలు త్వరితగతిన ఇస్తామన్నారు. ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్‌బి భంజ్‌దేవ్, సాలూరు ఎఎంసి ఛైర్మన్ ఎం.సూర్యనారాయణ, పాలకండలి సభ్యులు, తహశీల్దార్ బి.నీలకంఠ రావు, ఎంపిడిఒ జి.పార్వతి, వ్యవసాయశాఖ ఎడి జి.సత్యవతి, సాలూరు నియోజకవర్గంలోని నీటి సంఘం అధ్యక్షులు, పిఎసి సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు చెక్కును అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

కురుపాం : రైతన్నలకు వరం అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ అని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కార్యక్రమం ప్రారంభానికి ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో 39,084 మంది రైతులకు రూ.27 కోట్ల 36 లక్షల చెక్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ధర్మచంద్రారెడ్డి, ఎడి అన్నపూర్ణ, ఎఎంసి ఛైర్మన్ కడ్రక కళావతి, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కడ్రక మల్లేశ్వరరావు, ట్రైకార్ బోర్డు మెంబర్ పువ్వల లావణ్య, టిడిపి నాయకులు కోలా రంజిత్ కుమార్, కలిశెట్టి కొండయ్య, కార్పొరేషన్ డైరెక్టులు, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని గుచ్చిమిలో అన్నదాత సుఖీభవ రైతు సదస్సులో పార్వతీపురం ఎమ్మెల్యే బి.విజయచంద్ర పాల్గొన్నారు. సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద పార్వతీపురం నియోజకవర్గంలో రైతులకు రూ.18 కోట్ల ఆరు లక్షల మొత్తం విడుదల కావడంతో రైతులు సంబరాలు చేసుకున్నారు. రైతులతో కలిసి సిఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా వ్యవసాయ శాఖ రాబర్ట్‌పాల్, ఎఒ ఎస్ అవినాష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ : మండలంలోని కొండాపురంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలో గల 33,107మంది రైతులకు రూ.23 కోట్ల 15 లక్షలు చెక్కును స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ సి.యశ్వంత్ రెడ్డి, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భన సత్తిబాబు, వ్యవసాయ శాఖ ఏడి రత్నకుమారి, తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి, పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ ప్రతినిధి ఆకుల కుమార్, ఎంపిపి ప్రతినిధి సుధా, వైస్ ఎంపిపి వాకముడి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

క్షీణిస్తున్న నాయకుల ఆరోగ్యం

- రెండో రోజూ కొనసాగిన ఎస్‌ఎఫ్‌ఐ నిరవధిక నిరాహార దీక్షలు
- కాంగ్రెస్, సిఐటియు మద్దతు

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యార్థుల సమస్యలు పట్టించుకోలేని ప్రభుత్వాలు ఎవరికోసమని సిఐటియు, కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. జిల్లా విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు ఎస్‌ఎఫ్‌ఐ చేపడుతున్న నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు మంచినీరు తప్ప ఏమీ తీసుకోకపోవడంతో శనివారంతో రెండో రోజు వారి ఆరోగ్యం స్వల్పంగా క్షీణించింది. దీనిపై డిఆర్‌ఒ కె.హేమలతకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినతి పత్రం అందించారు. ముందుగా దీక్షా శిబిరానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, కాంగ్రెస్ ఒబిసి ఛైర్మన్ వంగల దాలినాయుడు, పేరెంట్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వి.శ్రీహరి, సిహెచ్.చంద్రరావు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వై.మన్మథరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకవైపు విద్యార్థులను మరోవైపు కార్మికులను జలగల్లా పట్టిపీడిస్తున్నారని విమర్శించారు. నాటి బ్రిటిష్ పాలన విధానాలను అవలంబిస్తూ నిరుపేదలను విద్యకు దూరం చేసే మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని, అందులో భాగమే నూతన జాతీయ విద్యా విధానమని అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూనే, కేంద్ర ప్రభుత్వ విధానాలను అనుసరిస్తుందని, దీనివల్ల పేదలకు విద్య అందని ద్రాక్షలా మారుతుందని తెలిపారు. రాష్ట్రంలో కార్మికుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తున్నారని, పని గంటలు పెంచుతూ, చిరుద్యోగులపై నైతిక దాడులకు పాల్పడుతున్నారని వాపోయారు. దీన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని, భవిష్యత్తులో ఎస్‌ఎఫ్‌ఐ పోరాటాలకు పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు.

కాంగ్రెస్ ఒబిసి ఛైర్మన్ దాలినాయుడు మాట్లాడుతూ నేటి ప్రభుత్వాలకు విద్యార్థుల సమస్యలు కానరావని, పాఠశాలలో వైద్య సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు పదుల సంఖ్యలో మరణిస్తున్నారని అయినా జిల్లా గిరిజన శాఖ మంత్రిలో గానీ, ప్రజా ప్రతినిధులకు గానీ ఎటువంటి చలనం లేకపోవడం అన్యాయమని మండిపడ్డారు. విద్యార్థులకు పురుగులు, రాళ్లు కలిగిన ఆహారాన్నే ప్రభుత్వం సరఫరా చేస్తుందని, దీనికి సిబ్బందిని బాధ్యులుగా చిత్రీకరిస్తూ చర్యలు తీసుకోవడం దుర్మార్గమని అన్నారు. పీజీ సెంటర్ ఏర్పాటు వల్ల పేద విద్యార్థులకు మరింత మెరుగు చేకూరుస్తుందని, ఉన్నత ఉద్యోగఅవకాశాల కల్పనకు తోడ్పాటునందిస్తుందని అన్నారు. డిగ్రీ చదువులు పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా నేటి ప్రభుత్వ విధానాలు ఉన్నాయని, విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ ప్రారంభించకపోవడం దారుణమని అన్నారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి గాడి తప్పుతున్న విద్యారంగాన్ని దారిలో పెట్టాలని, ఎస్‌ఎఫ్‌ఐ చేపడుతున్న విద్యారంగ సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.అనిల్, టి.అఖిల్, జిల్లా కోశాధికారి కె.డేవిడ్, జిల్లా ఉపాధ్యక్షులు సంధ్య, సురేష్, బి.గంగారావు, సిహెచ్.సింహాచలం, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నిరాహారదీక్ష శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు

డ్రైవర్ల సమ్మెతో వేతన ఒప్పందానికి అంగీకారం

పార్వతీపురం: అద్దె బస్సు డ్రైవర్ల వేతనం ఒప్పందానికి ఇతర సమస్యల పరిష్కారానికి యజమానులు అంగీకరించిన నేపథ్యంలో డ్రైవర్లు శనివారం సమ్మె విరమించారు. ఆదివారం ఉదయం నుంచి విధులకు హాజరయ్యేందుకు అంగీకరించారు. బస్సుల యజమానులు, హైయిర్ బస్సు డ్రైవర్లు , కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రెండున్నర సంవత్సరాలకు వేతన ఒప్పందం పత్రాన్ని రాసుకున్నారు.

నేడు విఆర్ఎస్ నీరు విడుదల

మక్కువ : మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు వెంగళరాయ సాగర నుంచి ఆయకట్టుకు సాగునీటిని ఆదివారం విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ ఎఇ రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. మక్కువ, బొబ్బిలి, సీతానగరం మండలాల ఆయ కట్టు భూములకు ఖరీఫ్ సాగుకు నీరందనుందని ఆయన తెలిపారు.

కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఆర్థిక బకాయిలు చెల్లించాలి

ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని, బోధనేతర కార్యక్రమాలు రద్దు కోరుతూ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యాన శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆప్తా నాయకులు గణపతిరావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహనరావు, ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పిఎఫ్, పిఆర్‌సి డిఎ, సరెండరు లీవులు ఇతర ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధించడానికి పూర్తి అవకాశాన్ని కల్పించాలని, బోధనేతర కార్యక్రమాలతో విలువైన పాఠశాల సమయాన్ని వృథా చేయొద్దని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం తక్షణమే పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరారు. బదిలీపై కొత్త స్థానాలకు వెళ్లిన ఉపాధ్యాయుల జీతాలు పెండింగ్ ఉంచడం పద్ధతి కాదని, తక్షణమే వారి జీతాలు చెల్లించేందుకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పి.కూర్మినాయుడు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె భాస్కరరావు, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి ఎం.మహేష్, ఎం.బాలకృష్ణ, హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు సిహెచ్ రత్నాకర్‌రావు, ఎస్‌టియు నాయకులు మురళీబాబు, నాయకులు యు.గోవిందనాయుడు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తీరుపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు : సిఐటియు

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లాలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు పెరిగాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు విమర్శించారు. శనివారం సుందరయ్య భవనంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్వతీపురం ఎమ్మెల్యే బోనేల విజయ చంద్ర ఆగడాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయన్నారు. అకారణంగా చిరుద్యోగుల తొలగింపులకు పాల్పడుతున్నారని, దీనికి ప్రత్యక్ష ఉదాహరణ బలిజిపేట మండలం అరసాడ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, పార్వతీపురం లోని కొత్తవలస మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల తొలగింపు అని చెప్పారు. ఈ తొలగింపులకు ఎమ్మెల్యే కారణమని విమర్శించారు. చట్టాలకు కట్టుబడి ఉండాల్సిన అధికారుల సైతం ఎమ్మెల్యేకు ఊడిగం చేస్తున్నారని దుయ్యబట్టారు. అనేక ఏళ్లుగా ఉద్యోగాలు చేసి ప్రజలకు సేవ చేస్తున్న వారిని రాజకీయ కారణాలతో వేధింపులకు పాల్పడడం సరైన విధానం కాదని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికార కూటమి నేతలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు తమ ధోరణి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే తరహాలో సాలూరు మండలం కరాసవలస కేజీబీవీ సిబ్బందిని అక్కడ మంత్రి సంధ్యారాణి రాజకీయ కారణాలతో తొలగించారని గుర్తు చేశారు. ఇప్పటికైనా పార్వతీపురం ఎమ్మెల్యే ధోరణి మార్చుకోకపోతే నేరుగా ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని సిఐటియు నాయకులు హెచ్చరించారు. అకారణంగా తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులను, కెజిబివి సిబ్బందిని విదుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో న్యాయపోరాటానికి సిద్ధపడతామని తెలిపారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి వి రమణ, సిఐటియు పట్టణ కన్వీనర్ బి సూరిబాబు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

అంగన్వాడీ కేంద్రాల్లో ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌ను రద్దు చేయాలని అంగన్వాడీ వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు పి.సరళ కుమారి, కురుపాం ప్రాజెక్ట్ నాయకులు జె.సరోజ డిమాండ్ చేశారు. శనివారం కురుపాం ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఐసిడిఎస్ సిబ్బందికి వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు దగ్గర ఉన్నటువంటి ఫోన్లన్నీ కూడా ఆగస్టు 4న ఐసిడిస్ ఆఫీస్‌కి అందజేసి 5 నుంచి ఆన్లైన్ సేవలు వర్కు చేయకుండా అంగన్వాడీ కార్యక్రమంలో ఉన్నటువంటి కార్యక్రమాలన్నీ కూడా రికార్డుల ద్వారా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

ఆకాంక్ష హాత్‌తో మహిళా సంఘాల ఆర్థిక స్థితి మెరుగు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆకాంక్ష హాత్‌తో మహిళా సంఘాల ఆర్థిక స్థితి మెరుగుపడనుందని, స్థానిక ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయడానికి ఈ వారం రోజుల ప్రచారం దోహదపడు తుందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆకాంక్షాత్మక బ్లాక్ నుంచి స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడానికి ఇది ఉపయోగపడుతుందని అన్నారు. మహిళా సంఘాల ద్వారా తయారు చేసిన వస్తువుల ప్రదర్శన, విక్రయాల స్టాళ్లు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ స్టాళ్లను తిలకించి, వివరాలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని మారుమూల, చేరుకోలేని ప్రాంతాలలో స్థానిక ఉత్పత్తులు మార్కెట్ లభ్యతను పెంచుతుందని అన్నారు. ఈ చొరవ ద్వారా స్థానిక మహిళా స్వయం సహాయక బందాలు, రైతులు, చేతి వృత్తులు, నేత కార్మికుల ఆర్థిక స్థితి మెరుగుపడనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రదర్శనతో వినియోగ దారులు సరసమైన ధరలకు స్థానిక ఉత్పత్తులను పొందగలుగుతారని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, ఎపిఒ ఎ.మురళీధర్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డిఇఒ బి.రాజకుమార్, డిఎఫ్‌ఒ జి.ఎ.పి.ప్రసూనా, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డిపిఒ టి.కొండలరావు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, ఇతర జిల్లా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గించి, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ప్రమాదాన్ని, విద్యుత్ ఛార్జీల భారాన్ని వివరిస్తూ పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు, కోటవీధి, దాసరివీధి, గాంధీనగరంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాలకు లొంగి గత వైసిపి ప్రభుత్వం కార్పొరేట్ అధినేత అదానీ కంపెనీలకు 25 ఏళ్లపాటు ఏడు వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం చేసుకుందని, దీంతో గత ప్రభుత్వం ఎన్నికల్లో ఓడిపోయిన నేడు కూటమి ప్రభుత్వం మాత్రం అదానిని వదులుకోలేదని విమర్శించారు. అదానీకి ఇచ్చిన ప్రాజెక్టులను కొనసాగిస్తూ ప్రజలకు విద్యుత్ భారాలు వేసేలా నిర్ణయాలు చేసి ఆ ఒప్పందాలను ముందుకెసుకువెళ్తున్నారని విమర్శించారు. అందులో భాగంగానే అదాని స్మార్ట్ మీటర్లు ప్రజలకు బలవంతంగా కట్టబెడుతున్నారని ఈ విధానాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ప్రజలపై భారాలు వేసే ఈ నిర్ణయాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈనెల 5న విద్యుత్ కార్యాలయాల వద్ద జరిగే ఆందోళన పోరాటాల్లో ప్రజలు భాగస్వామై తమ నిరసనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు రాముడు, స్వప్న, దేవి, సీత ప్రజలు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్న ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఈనెల 5న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పలు ప్రజా సంఘాల నాయకులు పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం వైసీపీ ప్రభుత్వం ఆదానీకి సంబంధించిన స్మార్ట్ మీటర్లను రాష్ట్రంలో బిగించేందుకు ఒప్పందాలు చేసుకున్నారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేస్తామనే ప్రజలకు ఇచ్చే హామీలు ఇప్పుడు కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కిందని విమర్శించారు. ఈ స్మార్ట్ మీటర్ల బిగింపు చర్యను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని, ఈ మీటర్ల వల్ల ప్రజలకు ఎంతో నష్టం వాటిల్లుతుందని, ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియచెప్పేందుకు ఈనెల 5న జరిగే ధర్నా లో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బి.సూరిబాబు, ఎం.భాస్కర్ రావు, పి.సంగం, బి.లక్ష్మి, పి.రంజిత్ కుమార్, ఎస్.ఉమామహేశ్వరావు, ఎస్.విశ్వేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

కొమరాడ : విద్యుత్ ఛార్జీల పెంపుదల ఆపాలని, ప్రమాదకరమైన స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ఈనెల 5న తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. సిపిఎం, ఎపి గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూనేరు సంతలో విద్యుత్ వినియోగదారుకు వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. ప్రభుత్వ చర్యలను నిరస్తూ ఈనెల 5న పార్వతీపురంలో విద్యుత్ వినియోగదారులతో భారీ ధర్నా ఉందని, కావున ఈ ధర్నాకు విద్యుత్ వినియోగదారులంతా పెద్ద ఎత్తున కదిలి ప్రభుత్వానికి ఒక హెచ్చరిక ఇచ్చేలా ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘ నాయకులు సిహెచ్ లక్ష్మయ్య, శివుని నాయుడు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

పార్వతీపురం పట్టణంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

గిరిజన నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు జర్మన్ భాషపై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని గిరిజన నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు జర్మన్ భాషపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారితో కలిసి ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఐరోపా దేశాల్లో నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు ఎక్కువ ఉపాధి అవకాశాలు వున్నాయన్నారు. ఉపాధికి అవసరమైన జర్మన్ భాషను నేర్చుకునేందుకు 8-10 మాసాలతో పాటు విశాఖలో ఉచిత వసతి, భోజన సదుపాయాలతో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి, అర్హతలు కలిగిన నిరుద్యోగ గిరిజన నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు ఈ నెల 7లోగా తమ దరఖాస్తులను ఉప సంచాలకులు, గిరిజన సంక్షేమ శాఖ, పార్వతీపురం మన్యం జిల్లాకు సమర్పించాలని కోరారు. మరిన్న వివరాలకు తమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

చిదిమిలో వైద్య శిబిరం

వీరఘట్టం : మండలంలోని చిదిమిలో శనివారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు, గర్భిణీలు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్యతనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

పి-4.. నేతి బీరకాయేనా?

ప్రజాశక్తి - పార్వతీపురం



పబ్లిక్ ప్రయివేటు పీపుల్స్ పార్టిసిపేషన్ పాలసీతో రాష్ట్రంలో పేదరికం నిర్మూలించవచ్చునని సిఎం చంద్రబాబు నాయుడు భావిస్తున్నారు. అందుకనుగుణంగా విధానం రూపకల్పన చేసి మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు చూడడానికి బాగానే ఉన్నాయి. కానీ వాటిని ఆచరణలో పెట్టడానికి అధికారులు, ఉద్యోగులకు శిరోభారంలా మారుతోంది. ప్రభుత్వాలు గత కొంతకాలంగా ఇబ్బడిముబ్బడిగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ నిర్మూలన కాని పేదరికం పి-4 విధానంతో ఎలా మాయమవుతుందనే చర్చ మొదలైంది. గత పదేళ్లుగా ప్రభుత్వాలు సంక్షేమ పథకాల పేరుతో నేరుగా పేదల ఖాతాల్లోకి లక్షల కోట్ల రూపాయలు బదిలీ చేశాయి. వైసిపి ప్రభుత్వం నవరత్నాల పేరిట ఐదేళ్ల లో సుమారు రెండున్నర లక్షల కోట్ల రూపాయల మేర పేదలకు పంపిణీ చేసింది. ఏడాదిన్నర క్రితం జరిగిన ఎన్నికల్లో టిడిపి కూటమి పార్టీలు వైసిపిని మించిన హామీలిచ్చి అధికారంలోకి వచ్చాయి. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో టిడిపి ప్రభుత్వం కూడా సూపర్ సిక్స్ హామీల అమలు కోసం ఒక్కో అడుగు ముందుకు వేస్తోంది. ఈ పథకాల కింద ప్రభుత్వం పేదలకు నేరుగా డబ్బులు పంపిణీ చేస్తోంది. సంక్షేమ పథకాల ద్వారా ఏటా వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా పోని పేదరికం పి4 విధానంతో పోతుందనేది నేతి బీరకాయ చందమని జనం చర్చించుకుంటున్నారు. పోనీ ఈ పి-4 విధానంలో ఉద్యోగాలు, ఉపాధి కల్పనకు సంబంధించిన అంశాలు ఉన్నాయనుకుంటే అదీ లేదు. పేదరికం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో, వెనుకబడిన ప్రాంతాల్లో కార్పొరేట్ కంపెనీలతో ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతంలో ఉన్న యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఒక్కో పేద కుటుంబానికి చెందిన ఒక వ్యక్తికి ఉద్యోగం లేదా ఉపాధి కల్పించడం ద్వారా ఆ కుటుంబాన్ని క్రమేణా పేదరికం నుంచి బయటకు తీసుకుని రావచ్చుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఉన్న పరిశ్రమలు మూతపడగా, ఒక్క కొత్త పరిశ్రమ ఏర్పాటు కాలేదు. దీంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోసం వలసలు వెళ్లిపోగా, మరికొంతమంది హోటళ్లలోనూ, అపార్టుమెంట్ల వద్ద సెక్యూర్టీ గార్డుగానూ చాలీచాలని వేతనాలతో పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. పి-4లో ఉపాధి, ఉద్యోగ కల్పన దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. కానీ సంక్షేమ పథకాల అమలు ద్వారా నగదు బదిలీ చేసినట్లు గానే పి-4 విధానంలో కూడా మార్గదర్శులతో ఆర్థిక సాయం చేయడం వల్ల చేకూరే ప్రయోజనం ఏమీ వుండకపోవచ్చునని భావిస్తున్నారు. ఈ విధానం అమలులో భాగంగా కొంతమంది అధికారులు, ఉద్యోగులు మార్గదర్శులు కావాలని ఒత్తిడి చేయడం వల్ల ఫలితం వికటించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈనెల 15 నాటికి పి4 విధానం లో భాగంగా ఎంపిక చేసిన బంగారు కుటుంబాలకు మార్గదర్శకులచే సాయం చేయించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. మన్యం జిల్లాలో 33,309 కుటుంబాలను ఎంపిక చేయాలని నిర్ణయించగా, ఇప్పటి వరకు కేవలం 13వేల కుటుంబాలను మాత్రం ఎంపి చేశారు. ఎంపికైన బంగారు కుటుంబాలలో సగం మందికి కూడా మార్గదర్శులు దొరకని పరిస్థితి కనిపిస్తోంది. ఇంతవరకు ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన కోసం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు ద్వారా చేకూరని ప్రయోజనం పి4 విధానం అమలుతో వస్తుందని ఆశించడం అత్యాశే అవుతుంది.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఎట్టణానికి చెందిన బహుముఖ ప్రజ్ఞాశీలి పట్టణ ప్రజలందరికీ సుపరిచితులు సంస్కృత భాషలో పండితులు ఉపాధ్యాయ విద్యార్థులు సాహితీవేత్త, ప్రముఖ ఉపాధ్యాయులు జెబి తిరుమలాచార్యులు (55) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. తిరుమలాచార్యులు మాస్టర్ పట్టణంలో ప్రతి ఒక్కరికీ సుపరిచితులే. ఆయనకు సంస్కృత భాషలో విశేష సేవలు అందించినందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం అనేక అవార్డులను అందజేసింది. తిరుమలచార్యులకు పిల్లలు లేరు. భార్య కల్యాణి గృహిణిగా ఉంది. ఆయన ప్రస్తుతం పార్వతీపురంలో సంస్కృత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. సాలూరు సాహితీమిత్ర బృందం వ్యవస్థాపక అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. పట్టణంలో ప్రభుత్వ రాజకీయ కార్యక్రమాల్లో వ్యక్తగా చాలా ఏళ్లగా పాల్గొని అందరి మన్ననలు పొందారు. పట్టణ ప్రజలకు సుపరిచితులుగా ఉన్న ఆయన మరణం పట్టణ ప్రజలకు తీరని దుఃఖాన్ని మిగిల్చిందని పలువురు వ్యక్తపరిచారు. భౌతికాయనికి కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడీక రాజన్నదొర, పట్టణ ప్రముఖులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళిలు అర్పించారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల కేంద్రంలో గల పెట్రోల్ బంకు వద్ద ఎస్సై రమేష్ నాయుడు ఆధ్వర్యంలో వాహన తనికీలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, తప్పక నియమాలు పాటించాలని అన్నారు. మైనర్లు వాహనాలను నడపరాదని వాహన చోదకులు తప్పనిసరిగా లైసెన్సులను కలిగి ఉండాలని అవగాహన కల్పించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించే నడిపినట్లైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ప్రతి గ్రామంలోనూ జయప్రదం చేసేలా గిరిజన యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సుందర్రావు, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని కూనేరు సంతలో శనివారం ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవం రోజున గిరిజన సమస్యల పరిష్కారం కోసం ప్రతిజ్ఞ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివుని నాయుడు ఆదివాసీ గిరిజన యువతి యువకులు పాల్గొన్నారు.

మర్రిపాడులో 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మర్రిపాడు పంచాయతీలో సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వ విజయాలను కరపత్రాల ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్లు సవర మంగయ్య, మూర మోహనరావు, రామకృష్ణ, మాజీ ఎంపిటిసి జయలక్ష్మి, రంగన్నాథం, సుధాకర్ మహిళలు పాల్గొన్నారు.

ఎంఇఒకు అవార్డునుఅ ందజేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

అవార్డు అందుకున్న ఎంఇఒ

ప్రజాశక్తి - కురుపాం

జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ చేతుల మీదుగా కురుపాం ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, సిఆర్పి ఆకుల మాధవి శనివారం కలెక్టరేట్లో అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా గుర్తించిన ఆరు ప్రామాణికల్లో మన్యం జిల్లాలో 100శాతం లక్ష్యం సాధించినందుకు గాను అవార్డు అందజేశారని తెలిపారు. ఈ అవార్డు మరికొంత బాధ్యతలు పెంచిందన్నారు. మండలాన్ని విద్యారంగంలో అన్ని విధాలా ముందుంచేందుకు తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. అవార్డును అందుకున్న ఎంఇఒకు, సిఆర్‌పికి పలువురు మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు అభినందించారు.

శ్మశాన వాటిక పరిశీలన

ప్రజాశక్తి - వీరఘట్టం

వీరఘట్టం రెల్లి వీధికి సమీపాన గల శ్మశాన వాటికను శనివారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. సర్వే నెంబరు 398లో 3.95 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న శ్మశాన వాటిక అక్రమణలకు గురైందని, ఇటీవల స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు కదిలి శ్మశాన వాటికను పరిశీలించి ఆక్రమణలు తొలగించి అక్రమణ దారులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి -సాలూరురూరల్

స్థానిక పాత బిఎస్ఎన్ఎల్ కార్యాలయం రోడ్డు వద్ద నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నారన్న సమాచారంతోఆ వ్యక్తులను పట్టుకొని విచారించారు. తమిళనాడుకు చెందిన వివేక్, మల్లిక, అంతల్ సీతారాం, సురేంద్రను పట్టణ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి బ్యాగులను తనిఖీ చేయగా వాటిల్లో గంజాయి ప్యాకెట్లు ఉన్నాయి. వీటి బరువు 17.330 కిలోలు ఉందని, వీటిని మల్కనగిరి వద్ద కొనుగోలు చేసి చెన్నై తరలిస్తుండగా వీరిని సాలూరులో పట్టుకొని సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సిఐ బి. అప్పలనాయుడు తెలిపారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు చేస్తున్న కృష్ణారావు

రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న పాఠశాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. 15 మంది విద్యార్థులకు దృష్టి దోషం ఉన్నట్లు గుర్తించి వారికి త్వరలో కళ్ల జోళ్లు పంపిణీ చేస్తామని, ఈ కళ్ల జోళ్లతో కంటి చూపు కాపాడుకోవడానికి శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారి కృష్ణారావు నేత్ర పరీక్షలు నిర్వహించి, నేత్ర వ్యాధులు - వాటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించి వ్యాధులు రాకుండా, దృష్టి దోష నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

గిరిజనుల హక్కులపై పాలకుల దాడి

ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక ఛైర్మన్ లక్ష్మణమూర్తి

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణమూర్తి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కేంద్రం, రాష్ట్రంలో ఉన్న పాలక ప్రభుత్వాలు రాజ్యాంగం కల్పించిన గిరిజనుల హక్కులు, చట్టాలపై దాడులు చేస్తూ వాటిని నిర్వీర్యం చేసే దిశగా పాలన సాగిస్తున్నాయని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక ఛైర్మన్ కోలక లక్ష్మణ మూర్తి అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకల్లో భాగంగా మండలంలోని మారుమూల ప్రాంతమైన గొరడలో పది పంచాయతీలకు చెందిన గిరిజనులతో కలిసి ఆదివాసీ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు గిరిజనుల జీవన విధానంపై పక్షపాత వైఖరి అవలంబిస్తూ అడవి నుంచి వెళ్లగొట్టేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగానే జిఒ 3ను రద్దుచేసి ఏజెన్సీలో నూటికి నూరు శాతం ఉద్యోగ అవకాశాలు లేకుండా చేశాయని విమర్శించారు. ఆనాటి పోరాటాల ఫలితంగా సాధించుకున్న 1/70, చట్టం, జిసిసి, ఐటిడిఎ సంస్థలకు రక్షణ లేకుండా చేస్తున్నాయన్నారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటిడిఎలో పాలన పూర్తిగా గాడి తప్పిందన్నారు. నిరుద్యోగ సమస్య ఎక్కువగా కనిపిస్తుందన్నారు. స్పెషల్ డిఎస్సితో గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల హక్కులు చట్టాల రక్షణకై ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం పటిష్ఠంగా అమలు కావడం లేదన్నారు. చాలామంది గిరిజనులకు సాగుభూమికి పోడు పట్టాలు ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. దీంతో గిరిజనులు భూమిపై హక్కు హక్కు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. ఏజెన్సీలో పరిశ్రమల పేరుతో భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించి ఆదివాసీలను అడవి నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇదే జరిగితే తరతరాల నుంచి అడవినే నమ్ముకున్న గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనుల హక్కులపై ఉద్యమించిన నాడే రక్షణ ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు పలువురుని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి పువ్వల తిరుపతిరావు, ఆదివాసీ నాయకులు తోయక నాగభూషణ్, తాడంగి జమ్మయ్య తదితరులు ఉన్నారు.

భాగస్వామ్య విధానంతో సమాజాభివృద్ధి

ప్రజాశక్తి - పార్వతీపురం

భాగస్వామ్య విధానంతో సమాజ అభివద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల అభివృద్ధికి అమలు చేస్తున్న ఆది కర్మయోగి కార్యక్రమం శిక్షకులకు అవగాహన కార్యక్రమం శనివారం ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖల సమన్వయ సహకారాలు, సమాజ భాగస్వామ్యంతో మార్పు వస్తుందని ఆయన స్పష్టం చేశారు. వచ్చే మూడేళ్లలో లక్ష్యాల సాధనలో జిల్లా అగ్రభాగాన ఉండాలని ఆయన సూచించారు. ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ వ్యక్తుల పని సామర్థ్యం పెంపు, సమన్వయం ఆది కర్మయోగి కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. వచ్చే నెల నుంచి గ్రామ స్థాయి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభం అవుతాయన్నారు. జిల్లాలో 113 గ్రామ సచివాలయాల పరిధిలో గల 165 గ్రామాలను మొదటి విడతలో ఆది కర్మయోగి కార్యక్రమానికి ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ పియం జన్ మాన్ ప్రాజెక్టు అధికారి రిషబ్ ద్వివేది మాట్లాడుతూ అట్టడుగు స్థాయి నుండి ఉన్నత స్థాయి అభివద్ధి తరహా చర్యలకు యోచించాలని అన్నారు. సమగ్రమైన ఆలోచనా విధానం, సామాజిక అవగాహన, సమన్వయంతో గిరిజన అభివద్ధి సాధించాలన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి ధర్మచంద్రా రెడ్డి, ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, జిల్లా స్థాయి శిక్షకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా అన్ని రంగాల్లో ముందంజలో ఉండేలా కషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా, మండల స్థాయి అధికారులకు పిలుపునిచ్చారు. ఐటిడిఎ ఆధ్వర్యంలో సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమరోహ్(సాస్) కార్యక్రమం శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని నీతి అయోగ్ సూచికల్లో సంతృప్తి నిచ్చిన జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ఫ్రంట్‌లైన్ కార్మికులకు ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి పతకం, ప్రశంసా పత్రాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను ఆశావహ జిల్లాగా నీతి అయోగ్ ప్రకటించేందుకు కృషి చేసిన అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఇక్కడ విద్య, వైద్య రంగాల్లోని అధికారులు కష్టపడి పనిచేస్తారని, అందుకే 10వ తరగతి ఉత్తీర్ణతలో రాష్ట్రస్థాయిలో మంచి ఫలితాలను సాధిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఆశావాహ జిల్లాగా ఎంపికైందన్నారు. ఆశావాహ జిల్లాలు, బ్లాక్‌ల్లోను సూచికల్లో శత శాతం సంతృప్తి సాధించే లక్ష్యంతో నీతి ఆయోగ్ "సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమరోహ్"ను ప్రారంభించిందని కలెక్టర్ గుర్తుచేశారు. నీతి ఆయోగ్ సూచనలకు అనుగుణంగా పనిచేసి సంతృప్తినిచ్చిన జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ఫ్రంట్‌లైన్ కార్మికులంతా ఇదే స్ఫూర్తితో మున్ముందు పనిచేసి జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, డిఇఒ బి.రాజకుమార్, డిఎఫ్ఒ జిపిపి ప్రసూనా, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఇతర జిల్లా, మండల స్థాయి అధికారులు, విద్య, వైద్య, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో25 వ వార్డు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాల్టీ పరిధిలో గల 25వ వార్డులోని పెదరజకవీధి, రజకవీధుల్లో వీధిదీపాలు వెలగకపోవడంతో ఆ వీధుల్లో అంధకారం అలముకుంది. దీంతో రాత్రివేళ్లలో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు అన్నారు.పట్టణంలోని వీధి దీపాల నిర్వహణను రూ.20 లక్షలకు విజయనగరానికి చెందిన కాంట్రాక్టరు టెండర్ దక్కించుకున్నారని, అయితే పనులు మాత్రం చేపట్టడంలేదని తెలిపారు. పూర్తిస్థాయిలో సిబ్బందితో పనులు చేయకపోవడం వల్ల పలు వీధుల్లో వీధిదీపాలు వెలగడంలేదన్నారు. అయినప్పటికీ మున్సిపల్ ఇంజినీరింగు అధికారులకు గాని, కౌన్సిలర్లకు గానీ చీమకుట్టినట్లైనా లేదని విమర్శించారు.

తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా జిల్లా ఆసుపత్రిలో డిసిహెచ్ఎస్ డాక్టర్ నాగభూషణరావు ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తల్లిపాలు ప్రాముఖ్యతపై అక్కడ ఉన్న గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించారు. బిడ్డకు పుట్టిన గంట లోపే తల్లిపాలు తాగించాలని, ఇవి బిడ్డకు మొదటి సహజ టీకా అని పేర్కొన్నారు. బిడ్డకు పాలివ్వడం వల్ల తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్నారు. రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా, రొమ్ములో గడ్డలు, కణతులు ఏర్పడకుండా దోహదపడుతుందన్నారు. ఈ నెల 7 వరకు తల్లిపాలు వారోత్సవాలను కొనసాగించాలని, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని వైద్య అధికారులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ జి.నాగభూషణరావు, డిఐఒ డాక్టర్ విజయమోహన్, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగన్మోహనరావు, డాక్టర్ రఘు, డాక్టర్ కౌశిక్, వైద్యులు డాక్టర్ సంజీవనాయుడు, డాక్టర్ లావణ్య, సూపర్వైజర్ పుష్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కారమని ఐసిడిఎస్ సిడిపిఒ జి.రజినీదుర్గ అన్నారు. తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా శనివారం కురుపాం-3 అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణీలకు, బాలింతలు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డ ఎదుగుదల, ఆరోగ్యంగా ఉండడానికి తల్లిపాలు ఎంతో ఉపయోగపడతావని, ప్రతి తల్లీ తల్లిపాలును బిడ్డకు క్రమం తప్పకుండా ఇచ్చేలా చూస్తూ అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అంగనవాడీ సిబ్బందితో కలిసి తల్లిపాలు వారోత్సవాలపై కురుపాంలోని పలు వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ వై.రామలక్ష్మి, అంగన్వాడీ వర్కర్లు జె.సరోజ, శోభ, సూర్య కుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేటలో పెదబోగిలి మేజర్ పంచాయతీ పరిధిలో గల అంగన్వాడీ కేంద్రాల టీచర్లు, గర్భిణులతో తల్లిపాలు వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ రాజలక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమం వారం రోజుల పాటు అన్ని కేంద్రాల్లోనూ జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ పూర్ణిమ, ఎంపిటిసి సభ్యులు బురిడి కుసుమ, అంగన్వాడి కార్యకర్తలు శ్రీదేవి, సునీత, మేరీ, రమాదేవి, రామలక్ష్మితో పాటు పలువురు అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పాలకొండ : నగర పంచాయతీ పరిధిలో గల యాలం అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాలు వారోత్సవాలు నిర్వహించారు. సూపర్వైజర్ లింగల శాంతి కుమారి మాట్లాడుతూ పుట్టిన బిడ్డలకు తల్లిపాలు ఎంత శ్రేయస్కారమన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ఎన్నో పోషక విలువైన ఆహార అందిస్తుందని దాన్ని బాలింతలు, గర్భిణీలు వినియోగించుకోవాలన్నారు.

కొమరాడ : మండలంలోని గంగరేగువలస, సెక్టార్ పరిధిలో గల సోమినాయుడువలస, గుణానపురంలో తల్లిపాలు వారోత్సవ కార్యక్రమాలు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి జి.సుగుణ కుమారి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు దూరం చేస్తే పసిపిల్లలు పూర్తిగా నీరసంగా ఉండే పరిస్థితి ఉంటుందన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వ అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని సద్వినియం చేసుకోవాలని కోరారు. విక్రాంపురం సెక్టర్ పరిధిలో గల అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ బంగారమ్మ ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు శారదాంబ, బంగారమ్మ, సెక్టార్ యూనియన్ నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని సెక్టర్ 1పరిధిలో తల్లిపాలు వారోత్సవ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జె.జ్ఞానమ్మ పాల్గొన్నారు. ముఖ్యంగా గర్భిణీలు విలువలతో కూడిన పోషక ఆహారం తీసుకోవాలన్నారు. అంతేకాకుండా వైద్యులు సలహాలు, సూచనలు పాటించడంతో పాటు తరచుగా వైద్య తనిఖీలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఎన్ఎంలు, గర్భిణీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని కేసరి, భామినిలో తల్లిపాల వారోత్సవం కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాలు ప్రాముఖ్యతపై సిడిపివో శాంతి భవాని ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ గురుబిల్లి సబిత, జ్యోతిలక్ష్మి, భామిని వైద్య సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

భవిష్యత్ శాస్త్రవేత్తల కోసం అంతరిక్ష విద్యా శిబిరం

బాలికల ఆశ్రమ పాఠశాలలో స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంప్

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ, పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - సీతంపేట

సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా, ముస్కాన్ సహకారంతో నిర్వహించిన స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంప్ స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఐటిడిఎ పిఒ సి.యస్వంత్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు పర్యవేక్షణలో ఈ క్యాంప్‌లో పాఠశాల విద్యార్థులకు టెలిస్కోప్, రోబోటిక్స్, వర్చువల్ రియాలిటీ, డ్రోన్లు వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పించడమే కాకుండా, ఈ సాంకేతికతలు ప్రస్తుత కాలంలో ఎలా ఉపయోగించబడుతున్నాయో వివరిస్తూ ప్రాక్టికల్ డెమోస్ నిర్వహించారు స్పేస్ ఎడ్యుకేటర్లు విద్యార్థుల్లో విజ్ఞానపరమైన ఆసక్తిని పెంపొందించడంలో కీలకపాత్ర పోషించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఆసక్తిగా ఈ సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలుసుకున్నారు. ఈ క్యాంప్ వారి భవిష్యత్ కెరీర్ నిర్మాణానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంప్ గ్రామీణ విద్యార్థుల్లో విజ్ఞానానికి ఒక వేదికగా నిలిచిందన్నారు. పాఠశాల యాజమాన్యం ఈ అవకాశాన్ని కల్పించినందుకు సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, సమగ్ర శిక్షా, ముస్కాన్ సంస్థలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిడి అన్నదొర, ఉప విద్యాశాఖధికారి జి రామ్ మోహనరావు, ఎఎంఒ కోటి బాబు, ఎంఇఒ ఆనందరావు ప్రధానోపాధ్యాయులు వసంత లక్ష్మి, హెచ్ డబ్ల్యుఒ పాలక కమల, జిసిటిఒ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు పునశ్చరణ తరగతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈ విద్యా సంవత్సరం నుంచి మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు సిలబస్, ప్రశ్నాపత్రాల కూర్పు, వివిధ గ్రూపుల సబ్జెక్టు కాంబినేషన్ల మార్పులు చోటు చేసుకున్న సందర్భంగా అధ్యాపకులను సంసిద్ధం చేయడానికి, విద్యార్థులను తీర్చిదిద్దడానికి అధ్యాపకులకు పునశ్చరణ తరగతులను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వై. నాగేశ్వరరావు ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల లో శనివారం ఈ తరగతులు ప్రారంభించారు . ఈ తరగతులు ప్రతీవారం చివరి పనిదినం రోజు జరుగుతాయని చెప్పారు. మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో వారానికి ఒక సబ్జెక్టు చెప్పున ఈ తరగతులు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా మొదట రోజు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల మ్యాథ్స్ అధ్యాపకులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించినట్లు చెప్పారు. తరగతి గది బోధనా ప్రక్రియలను మెరుగుకు సైన్స్ ఫ్యాకల్టీ సామర్థ్యాలను నిరంతరం అభివృద్ధి పర్చడానికి ఈ కార్యక్రమమం ఉద్దేశించబడిందని వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మారిన సిలబస్‌ను విద్యార్థులకు చక్కగా బోధించే నైపుణ్యాలను అధ్యాపకులంతా అలవర్చుకోవాలని కోరారు. ఈ సభలో 14 జూనియర్ కళాశాలల గణిత అధ్యాపకులతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు పాల్గొన్నారు.

155 వితంతు పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట గ్రామపంచాయతీలో కొత్తగా మంజూరైన స్పోజ్ పెన్షన్స్‌ను పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పంపిణీ చేశారు. మండలంలో 155 కొత్తగా ఈనెల స్పోజ్ మంజూరయ్యాయని, వీటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ బిడ్డికి సంధ్యారాణి, ఐటిడిపి కోఆర్డినేటర్ ఇమరిక పవన్, కూటమి నాయకులు ప్రసాద్ మోజూరు తేజోవతి, చంద్రశేఖర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, మేజర్ పంచాయతీ ఇఒ బి.కోటేశ్వరరావు, సచివాలయాల సిబ్బంది, పింఛనుదారులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులను గెస్ట్ లెక్చరర్ పద్ధతిలో బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.శ్రీవరం కోరారు. ఈనెల 5న సాయంత్రం 5గంటల్లోపు కళాశాలలో జిరాక్స్ కాపీలు సమర్పించాలన్నారు. 6న ఉదయం 10 గంటలకు జరగబోయే డెమో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

బిఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్‌ప్లాన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిఎస్ఎన్ఎల్ సరికొత్త ఫ్రీడం ప్లాన్ తీసుకొచ్చిందని, కేవలం రూ.1తో 30 రోజుల వ్యాలిడిటితో అపరిమిత కాలింగ్, రోజుకు 2 జిబి డేటా, 100 ఎస్ఎంఎస్‌లు పొందవచ్చని విజయనగరం ఆపరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ దాలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సిమ్ కార్డు కావాల్సిన వారు సమీపంలోని బిఎస్ఎన్ఎల్ సేవా కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకొండ

అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిడిపిఒ గీతాంజలికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు శనివారం వినతిపత్రం అందించారు. అంగన్వాడీలకు ఇచ్చే మొబైల్ ఫోను సరిగ్గా పనిచేయడం లేదన్నారు. అంగన్వాడి కేంద్రాలకు నాణ్యమైన సరుకులు అందించాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలని, తల్లికి వందనం పథకం వర్తింప చేయాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు జెస్సి బాయ్, బి.అమరవేణి, మణి కుమారి ఉన్నారు.

లీఫార్మా ఆధ్వర్యాన పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరురూరల్

లీ ఫార్మా విశాఖ వారిచే దీక్ష మహిళ రైతు సంఘం ఆధ్వర్యంలో ముంగివానివలసలో సుమారు 250 మంది గర్భిణీలు, బాలింతలకు వివిధ రకాలైన పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా లీ ఫార్మా ఫౌండర్ ఎ.లీలారాణి మాట్లాడుతూ రక్త హీనత ఉన్న గర్భిణీలు, బాలింతలు తీసుకునే ఆహారంలో పౌష్టికహారం ఉండేలా చిరుధాన్యాలు, ఆకుకూరలు తప్పనిసరిగా ఉపయోగించాలని, ఎప్పటికప్పుడు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో దీక్ష మహిళ వెల్ఫేర్ ఫౌండర్ ఎల్.శాంతి, అంగన్వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలు, రైతులు, ప్రజాప్రతినిధులు, భీమారావు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జిలకు సకాలంలో రుణాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్వయం సహాయక సంఘాలకు అవసరమైన రుణాలను అవసరమైన సమయంలో ఇవ్వాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్.. బ్యాంకర్లను ఆదేశించారు. శనివారం రుణ ప్రణాళిక, మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల రుణాల మంజూరుపై డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో పీడీ పి.శ్రీనివాస్ అధ్యక్షతన విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల రుణ మొత్తం రూ.2 లక్షలు దాటితే వారికి అవసరమైన రుణాలు ముద్ర, పిఎంఇజిపి, పిఎంఎఫ్ఎంఇ లేదా ఇతర స్కీముల ద్వారా పొందేలా బ్యాంకు మేనేజర్లు సహకరించాలని కోరారు. మహిళల ఆధ్వర్యంలో వ్యాపారాల కోసం రుణాలు తీసుకొన్న వారికి రెండు శాతం ఇంటర్ సబ్ వెన్షన్ కూడా వర్తిస్తుందని చెప్పారు. సిజిటిఎంఎస్ఇ స్కీమ్ కింద గ్యారంటీ ఫీజు చెల్లిస్తే ఆ రుణ మొత్తానికి రక్షణ లభిస్తుందన్నారు. స్త్రీనిధి బ్యాంకు ఎమ్‌డి హరిప్రసాద్, జిల్లా స్థాయి బ్యాంకర్స్ కమిటీ కన్వీనర్ కె.శ్రీనివాస్, డిఆర్‌డిఎ మన్యం జిల్లా పీడీ సుధారాణి, ఉడిపిఎంలు, ఎపిఎంలు పాల్గొన్నారు.

పెద్దగెడ్డ నుంచి సాగునీటిని విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి

పెద్దగెడ్డ నీరు విడుదల

ప్రజాశక్తి - పాచిపెంట

రైతుల సుభిక్షంగా సాగుబడి చేసినప్పుడు వారి కుటుంబాల్లో ఆనందం కూడా పండాలని అప్పుడే రాష్ట్రంలో సుభిక్ష వాతావరణం కలుగుతుందని రాష్ట్ర గిరిజన, స్త్రీశిశు సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. శనివారం పెద్దగెడ్డ జలాశయం నుంచి సాగునీటిని ఖరీఫ్ పంటలకు విడుదల చేశారు. రైతు కళ్లల్లో ఆనందమే ప్రభుత్వ ధ్యేయమని మరోసారి ఉద్ఘాటించారు. ప్రధాన కాలువ ద్వారా 30 క్యూసెక్కులు రివర్స్ స్లూయిస్ ద్వారా 30 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్దగెడ్డ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానన్నారు. అలాగే పాచిపెంట నుంచి అరకు రోడ్డు పూర్తి చేస్తామని డోలిమోతలు లేకుండా ఏజెన్సీ ప్రాంతాలకు రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. సరాయి వలస ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి రూ.4కోట్ల 70 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని, పాచిపెంట పిహెచ్‌సిని సిహెచ్‌సిగా మార్చేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు గూడెపు యుగంధర్, ఎఎంసి ఛైర్మన్ ముఖి సూర్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షులు గుంద్రోతు పార్వతమ్మ, మతల బలరాం, పూసర్ల నర్సింగరావు, చల్లా కనక, నిమ్మాది చిట్టి, పిన్నింటి ఈశ్వరరావు, సాలూరురూరల్ సిఐ రామకృష్ణ. పల్లెడ వెంకటరమణ. ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

శాలివాహన ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - సీతానగరం


రాష్ట్ర ఛైర్మన్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

స్థానిక కుమ్మర వీధిలో శాలివాహన రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ ఈశ్వరరావు శనివారం ఆత్మీయ కలయిక సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలివాహన సమస్యలపై పనిచేస్తానని కార్పొరేషన్ ద్వారా సభ్యులకు సహకార అందిస్తామన్నారు అలాగే స్థానిక శాలివాహన సంఘ నాయకులు ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా మట్టిని ఉచితంగా అందించాలన్నారు. 50 ఏళ్ల దాటిన శాలివాహన కార్మికులకు పెన్షన్ కార్పొరేషన్ ద్వారా ఇప్పించాలని వీటికి ప్రభుత్వం ద్వారా జీవోలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు అనంతరం ఆయనను సర్పంచ్ జె.తెరేజమ్మ, గరికయ్య, ఉపసర్పంచ్ కె అరవింద్ కుమార్, సిటీ కేబుల్ యాజమాన్యం చెలికాని గోపాలకృష్ణ సన్మానించారు ఈ కార్యక్రమంలో మన్యం జిల్లా ప్రెసిడెంట్ వెంకన్న సంఘ సభ్యులు పాల్గొన్నారు